క్లుప్తంగా

దేవాలయాలు ఆధ్యాత్మిక నిలయాలు

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు: దేవాలయాలు ఆధ్యాత్మిక నిలయాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ముత్తంగి గ్రామంలో నూతనంగా నిర్మించిన అక్క మహంకాళి సహిత కామారతి బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానసిక ప్రశాంతతకు ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని కోరారు. దేవాలయం అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ స్వప్న శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ ఉపేందర్, ఆత్మకమిటీ మాజీ చైర్మన్ కుమార్‌గౌడ్, లింగారెడ్డి, మెరాజ్‌ఖాన్ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిబంధనలు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

సంగారెడ్డి టౌన్: ఎన్నికల నిబంధనలు కచ్చితంగా పాటించాలని సంగారెడ్డి ఎంపీడీఓ యాదగిరి అన్నారు. బుధవారం ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఓటు హక్కును అందరూ వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో అధికారులు, నాయకులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

మేలు జాతి పశువులతో లాభాలు



పశువులకు చికిత్స చేస్తున్న గణేష్

న్యాల్‌కల్(జహీరాబాద్): పాడి రైతులు లాభాలు పొందాలంటే మేలు రకం పశువులను పెంచుకోవాలని మండల పశు వైద్యాధికారి గణేష్ సూచించారు. బుధవారం మండలంలోని మిర్జాపూర్(ఎన్)లో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు గర్భస్థ పరీక్షలు, సాధారణ చికిత్సలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గణేష్ మాట్లాడుతూ.. పశువులకు వ్యాధులు రాకుండా ఉండేందుకు టీకాలు వేస్తున్నామన్నారు. రైతులు, పశుపోషణాదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువుల పెంపకం, వాటి ఆరోగ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గోపాల మిత్ర సూపర్‌వైజర్ తుక్కారెడ్డి, గోపాలమిత్రలు ధన్‌రాజ్, జనార్దన్‌రెడ్డి, నాగప్ప, పాడి రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

జహీరాబాద్ టౌన్: సుచిరిండియా ఫౌండేషన్ వారు నిర్వహించిన నేషనల్ లెవెల్ టాలెంట్ టెస్ట్‌లో జహీరాబాద్ ఆర్ఎల్ఆర్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ కవిత తెలిపారు. పాఠశాల విద్యార్థులకు 9 అవార్డులు వచ్చాయన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సినీ నటుడు రావురమేష్ హైదరాబాద్ లలిత తోరణంలో విద్యార్థులు బహుమతులు అందజేశారన్నారు.

మలబార్ సేవలు అభినందనీయం

సంగారెడ్డి ఎడ్యుకేషన్: మహిళల అభివృద్ధిలో మలబార్ గోల్డ్ సేవలు అభినందనీయమని విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ రాజేందర్ సింగ్ అన్నారు. బుధవారం సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాలలో మలబార్ గోల్డ్ ఆధ్వర్యంలో వివిధ కళాశాలల అమ్మాయిలకు సీఎస్ఆర్ నిధుల ద్వారా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేశారు. కార్యక్రమానికి విచ్చేసిన మహిళలు అన్ని రంగాలలో రాణించడం శుభ పరిణామమన్నారు. బాలికల విద్యాభివృద్ధికి తమ వంతు సేవను ప్రతి సంవత్సరం అందించడం గర్వించదగిన విషయమని పేర్కొన్నారు. జిల్లాలో 192 మంది బాలికలకు ఒక్కరికి ఎనిమిది వేల నుంచి పదివేల చొప్పున స్కాలర్‌షిప్‌లు అందించారని తెలిపారు. జిల్లా సివిల్ సీనియర్ న్యాయమూర్తి , డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ రమేష్ మాట్లాడుతూ.. మలబార్ గోల్డ్ సంస్థ ప్రతి రోజు అన్నదానం , వృద్ధ ఆశ్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రత్న ప్రసాద్ చందానగర్ శాఖ అధికారులు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వర్ ఎన్ఎస్ఎస్ అధికారులు పాల్గొన్నారు.

రోడ్ల పక్కనే చెత్త.. వీధుల్లో దుర్గంధం

మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. రోడ్ల పక్కన ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది.. రోజుల గడుస్తున్నా.. శుభ్రం చేయకపోవడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో స్థానిక ప్రజలు ఎక్కడ రోగాల బారిన పడతామేమోనని ఆందోళన చెందుతున్నారు.

- చెత్తకుప్పలుగా రహదారులు
- వ్యాధుల భయంలో స్థానికులు
- పట్టించుకోని అధికారులు



వెలిమెల నుంచి రింగ్‌రోడ్డు వెళ్లే మార్గంలో రోడ్డుపై పేరుకుపోయిన చెత్తచెదారం

రామచంద్రాపురం (పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని రహదారులు చెత్తకుప్పలుగా మారుతున్నాయి. నిత్యం అధికారులు రాకపోకలు సాగించే రోడ్లపై పెద్ద ఎత్తున చెత్త పేరుకొని అస్తవ్యస్తంగా ఉన్నా అధికారులకు కనిపించకపోవడం విడ్డూరంగా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉస్మాన్‌నగర్ నుంచి కొల్లూరు వెళ్లే రేడియల్ రోడ్డుపై చెత్తచెదారంతో పాటు భవన శిథిలాలు డంపింగ్ యార్డును తలపించేలా పేరుకుపోయాయి. అలాగే, వెలిమెల నుంచి రింగ్‌రోడ్డు వెళ్లే మార్గంలో రోడ్డు పక్కనే పెద్ద ఎత్తున చెత్తను వేశారు. కొద్ది రోజులుగా చెత్తరోడ్లపై నిండిన అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పారిశుద్ధ్యంపై పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఎక్కడికక్కడ పేరుకుపోతున్న చెత్తతో దోమలు విజృంభిస్తూ.. అనారోగ్యాల బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పారిశుద్ధ్య పనుల జరిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మంత్రి దామోదర చొరవతో బిల్లు పాస్



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

సంగారెడ్డి: మంత్రి దామోదర రాజనర్సింహా చొరవతో అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లుపాస్ అయిందని కాంగ్రెస్ నాయకుడు రాజీవ్ మీదిదొడ్డి అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మాదిగ నాయకులు చేసిన ముప్పై ఏళ్ల పోరాటం నేటితో ఫలించిందన్నారు. ప్రత్యేక శాసన సభ సమావేశం పెట్టి గ్రూపులవారీగా ఎవరి జనాభా ఎంతో వారికి అనుగుణంగా రిజర్వేషన్ పంపకాలు చేసి అందరికీ సమాన అవకాశాలు కల్పించారని అన్నారు. ఏ కులానికి వ్యతిరేకం కాదని అద్భుతరీతిలో కేబినెట్ ఆమోదం పొందడంలో మంత్రి దామోదర కీలకంగా వ్యవహరించారని చెప్పారు. రాబోయే లోకల్ బాడీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మంచిని ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో టీఆర్ సీపీ నాయకులు వేణు, మురహరి, మొయిజ్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ హౌస్ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న అధికారులు

కంది(సంగారెడ్డి): మండల కేంద్రం కందిలో బుధవారం ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి అధికారులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా హౌసింగ్ ఏఈ మాధవరెడ్డి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మంజూరైన ఇళ్లను నిర్మించేందుకు మండలానికి ఒకటి చొప్పునా ప్రభుత్వం హౌసింగ్‌శాఖ ద్వారా మోడల్ హౌస్‌లను నిర్మిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ జోగప్ప, కంది ఈఓ విద్యాధర్‌గౌడ్, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు

ఐకేపీ కార్యాలయం ఆవరణలో..

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్‌లోని ఐకేపీ కార్యాలయం ఆవరణలో ఇందిరమ్మ మోడల్ హౌస్ పనులను బుధవారం ఎంపీడీఓ రాజశేఖర్ కౌలాస్ ప్రారంభించారు. మండలంలో ఇక్కడ నిర్మించే భవనం మాదిరిగానే లబ్ధిదారులు ఇంటిని నిర్మించుకోవాలని ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సిద్ధిలింగయ్యస్వామి, హౌసింగ్ ఏఈ మాధవరెడ్డి, ఏపీఓ రంగారావు, మాజీ సర్పంచ్ అడివప్ప తదితరులు ఉన్నారు.

నిరుద్యోగులను వంచించిన బీఆర్ఎస్



సమావేశంలో మాట్లాడుతున్న నీలం మధు

పటాన్‌చెరు: ఉమ్మడి మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం గజ్వేల్ లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా సిద్దిపేట జిల్లా డీసీసీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జి నర్సారెడ్డి అధ్యక్షతన ఎమ్మెల్సీ ఎన్నికల, పట్టభద్రుల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నీలం మధు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నిరుద్యోగులను వంచించిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 56 వేల కొలువులు ఇచ్చిందని తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు, సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరచడానికి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ నెలకొల్పడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అచ్చంపేట శాసన సభ్యులు డాక్టర్ వంశీకృష్ణ, తెలంగాణ రాష్ట్ర డైరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వామివారి ఆశీస్సులు ఉండాలి

పటాన్‌చెరు టౌన్: ఆపద మొక్కుల వాడు, అనాథ రక్షకుడు, భక్తుల కోర్కెలు తీర్చే కలియుగ దైవం వేంకటేశ్వరుడు అని కాంగ్రెస్ నేత నీలం మధు అన్నారు. బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సుజాత మహేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన భూసమేత వేంకటేశ్వర స్వామి అష్టాదశ వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

ఘనంగా సుదర్శన హోమం



హోమం నిర్వహిస్తున్న భక్తులు

జహీరాబాద్: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం సుదర్శన హోమం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సుదర్శన హోమం ప్రారంభించారు. ఆయా కాలనీలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ శేషురావు దంపతులు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో కాలనీ ప్రముఖులు నర్సింహారెడ్డి, రాజేష్, వీరయ్యస్వామి, ఉమామహేశ్వరరావు, చంద్రకాంత్ రెడ్డి, ఎల్‌రెడ్డి, పెంటారెడ్డి,దుర్గారెడ్డి, కృష్ణారెడ్డి, హేమశ్రీ, విశాలాక్షి, పద్మ, సురేఖ, ప్రభావతి, శ్రీదేవి పాల్గొన్నారు.

గణిత ప్రదర్శన భేష్



వినయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నారాయణఖేడ్: దక్షిణ భారతదేశ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లా నుంచి ప్రదర్శనలో పాల్గొన్న నిజాంపేట్ మండలం ర్యాలమడుగు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వినయ్‌కుమార్‌ను ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఎంఈఓ మన్మథకిషోర్ మాట్లాడుతూ.. గణిత ప్రదర్శన సంగారెడ్డిని నుంచి ఏర్పాటు చేయడం గర్వకారణమని అన్నారు. గణిత భావాలను సులభంగా అర్థం చేసుకోవడమనే ప్రాజెక్టు ద్వారా ఒకటి నుంచి 10వ తరగతి వరకు గణితానికి సంబంధించి అన్ని అంశాలను సులభంగా నేర్చుకోవడానికి తయారు చేసిన నమూనా అని అన్నారు. ఈ టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు సైతం దిశా నిర్దేశం చేసేలా ఉందన్నారు. కార్యక్రమంలో గణిత రిసోర్స్ పర్సన్ మహేశ్వర్‌రావు, కిష్టయ్య, విజయ్ కుమార్, మురళీకృష్ణ, దేవీసింగ్, విజయేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మేరి హీలిన, సత్తయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యం పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ

కంగ్టి(నారాయణఖేడ్): విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని ఎంఈఓ రహీమొద్దీన్ తెలిపారు. బుధవారం కంగ్టిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్రం స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేస్తూ విషయావగాహన, అభ్యసన సామర్థ్యాలు పెంపొందించడంతో విద్యార్థులు అన్నీ విషయాల్లో రాణిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సాంఘికశాస్త్రం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శివాజీ జీవితం స్ఫూర్తిదాయకం

మరాఠ యోధుడు ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా కాషాయ జెండాలతో జై శివాజీ అంటూ ర్యాలీ నిర్వహించారు. పలు చోట్ల రక్తదానం శిబిరాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఛత్రపతి శివాజీ జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమన్నారు.



నారాయణఖేడ్‌లో శోభయాత్ర నిర్వహిస్తున్న హిందూ సంఘాలు



పటాన్‌చెరు టౌన్‌లో ర్యాలీ..



జోగిపేట(అందోల్): జోగిపేటలో..



హత్నూర మండలం దేవులపల్లిలో..



జిన్నారం: నివాళులర్పిస్తున్న గ్రామస్తులు



సదాశివపేట పట్టణంలోని శివాజీచౌక్ వద్ద..



జహీరాబాద్: ఊరేగింపులో పాల్గొన్న అభిమానులు

పేనుబంక నివారణకు చర్యలు

ఏడీఏ నూతన్‌కుమార్



జొన్న పంటను పరిశీలిస్తున్న నూతన్‌కుమార్

కల్హేర్(నారాయణఖేడ్): జొన్న సాగులో పేనుబంక నివారణ చర్యలు చేపట్టాలని నారాయణఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని రాపర్తి, నిజాంపేట్ మండలం నాగధర్‌లో జొన్న, వరి సాగును పరిశీలించారు. పంట సాగుకు కాంప్లెక్స్ ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓలు కృష్ణవేణి, వంశీ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆలయ ఉత్సవాలు



పూజలు చేస్తున్న దంపతులు

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండలంలోని పోతిరెడ్డిపల్లిలో మంజునాథ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా బుధవారం గోపూజ, మంటప పూజ, రుద్రాభిషేకం, రుద్రహవనం, ధాన్యాధివాసం , గంగా-ధూపాధివాసం, శయ్యాధివాసం, ఫలాధివాసం వంటి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. రుద్రాభిషేకాన్ని శామ్‌నాథ్‌శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు మంత్రోచ్ఛరణల మధ్య దంపతుల చేతుల మీదుగా ఘనంగా జరిపించారు. కార్యక్రమాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సంక్షిప్త వార్తలు

◆ డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో 10 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని బుధవారం కోర్టులో హాజరుపరచగా ఏడుగురికి రూ.1500, ఒకరికి రూ. 2000 వేలు, మరోకరికి రూ.1000 జరిమానా విధించారు. అలాగే, మరోవ్యక్తికి జరిమానాతో పాటు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

◆ ఎస్ఎస్‌వీ రెస్టారెంట్‌లో మంటలు



న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని మామిడ్గి గ్రామశివారులో జహీరాబాద్-బీదర్ రోడ్డు పక్కనే ఉన్న ఎస్ఎస్‌వీ రెస్టారెంట్‌లో బుధవారం మంటలు చెలరేగాయి. రెస్టారెంట్ వెనక పొలాల వద్ద ఎవరో నిప్పుపెట్టడంతో మంటలు రెస్టారెంట్‌కు అంటుకున్నాయి. విశ్రాంతి గదులు, కన్వెన్షన్‌హాల్, ఇతర గదుల్లోని సామగ్రి కాలిపోయింది. రెస్టారెంట్‌లో ఉన్న వారు బయట పరుగులు తీశారు. పెద్దఎత్తున నష్టం జరిగినట్లు రెస్టారెంట్ యజమాని తెలిపారు.

◆ మద్యం పట్టివేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్ పరిధిలోని బెల్టు దుకాణాలపై మంగళవారం రాత్రి కొల్లూరు పోలీసులు దాడి చేసి 6 లీటర్ల మద్యం, 20 గుట్కాక ప్యాకెట్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

◆ నేడు విద్యుత్ అంతరాయం

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని గడ్డపోతారం, కిష్టయ్యపల్లి, ఖాజిపల్లి, వావిలాల గ్రామాల్లో నేడు విద్యుత్ అంతరాయం ఉండనున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుమ్మడిదల 132/33 కెవి సబ్‌స్టేషన్‌ల్లో మరమ్మతుల కారణంగా ఉ.10 గంటల నుంచి సా. 3 మూడు గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని గుమ్మడిదల ఏడీఈ దుర్గాప్రసాద్, ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు. పరిశ్రమల యజమాన్యం, వినియోగదారులు, సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

◆ రసాయన ఎరువులపై అవగాహన

జహీరాబాద్ టౌన్: మండలంలోని మల్‌చెల్మలో బుధవారం ఇన్‌సెక్టిసైడ్ కంపెనీ ప్రతినిధులు రైతులకు అవగాహన కల్పించారు. రసాయన ఎరువులు లైసెన్స్ కలిగిన డీలర్ వద్ద కొనాలని వారి నుంచి తప్పకుండా రశీదు తీసుకోవాలని చెప్పారు. పంటలకు ఉదయం, సాయంత్రం వేళలో మాత్రమే మందులను పిచికారీ చేయాలన్నారు. నీటి పరిమాణానికి సరిపడా మందులను కలుపుకోవాలని, పిచికారీ చేసే సమయంలో మాస్క్ ధరించాలన్నారు. కళ్లకు అద్దాలు చేతికి గ్లౌజులు వేసుకోవాలన్నారు. గాలి వీచే దశలో పిచికారీ చేయాలని సూచించారు.

◆ నూతన కార్యవర్గం ఎన్నిక

జహీరాబాద్ టౌన్: మున్సిపల్ వాటర్ సప్లయ్ వర్కర్స్ సంఘం(ఏఐటీయూసీ) నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కె.నర్సింలు, అధ్యక్షుడిగా ఎన్. రమేష్, ప్రధాన కార్యదర్శిగా ఎం.నర్సింలు ఉపాధ్యక్షుడిగా గౌసోద్దీన్, సహాయ కార్యదర్శులుగా సురేష్, సుదర్శన్, కోశాధికారిగా జాన్ చరణ్, సలహాదారులుగా నరేష్‌కుమార్, రవి ఎన్నికయ్యారు.

◆ ఫర్నిచర్ అందజేత



రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని జిల్లాపరిషత్ పాఠశాలకు ఐడీబీఐ బ్యాంక్ సీఎస్ఆర్ నిధుల కింద బుధవారం ఫర్నిచర్ అందజేశారు. ప్రధానోపాధ్యాయులు రాములు మాట్లాడుతూ.. ఐడీబీఐ శేరిలింగంపల్లి బ్రాంచ్ అధికారులు తమ పాఠశాలకు రూ.1.40లక్షల విలువ చేసే కుర్చీలు, టేబులు, బీరువాలను అందించారని చెప్పారు.. వారికి కృతజ్ఞతలు తెలిపారు.

◆ 10 జీపీఏ సాధించాలి

మునిపల్లి(అందోల్): పదవ తరగతిలో ప్రతి విద్యార్థి 10 జీపీఏ సాధించాలని మండల విద్యాధికారి భీమ్‌సింగ్ విద్యార్థులను కోరారు. బుధవారం మండలంలోని పెద్దచల్మెడ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించి ప్రాక్టీస్ 2 పరీక్షలను పరిశీలించారు. 10వ తరగతిలో అధికమార్కులు సాధిస్తే భవిష్యత్తులో ఉన్నత చదువు చదవడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగభూషణం, ఉపాధ్యాయులు సోమలింగం, దుర్గయ్య, కృష్ణకుమారి, సూరాజ్, రవీందర్ విద్యార్థులు పాల్గొన్నారు.

◆ విద్యుత్ షాక్‌తో గేదె మృతి

జహీరాబాద్ టౌన్: విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని మల్‌చెల్మ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మల్‌చెల్మకు చెందిన రైతుగౌస్ గేదెను మేతకు తీసుకెళ్లి సాయంత్రం ఇంటికి వస్తున్న క్రమంలో రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సపోర్టు తీగ తాకడంతో కరెంట్ షాక్ కొట్టి గేదె అక్కడిక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.50 వేలు ఉందని గౌస్ వాపోయారు. సపోర్టు తీగలకు కరెంట్ సరఫరా అవుతున్నందున ప్రమాదం పొంచి ఉందని.. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

◆ కళ్లద్దాల పంపిణీ

నారాయణఖేడ్: నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బుధవారం జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రపు మశ్చందర్ కళ్లద్దాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఇటీవల నిర్వహించిన వైద్య శిబిరంలో చూపు సమస్యతో బాధపడుతున్నవారికి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా కోఆర్డినేటర్ వి.నరేందర్, మాజీ ఎంపీటీసీ అంజయ్య, రుద్రార్ మాజీ సర్పంచ్ ప్రభాకర్, సంఘం బాధ్యులు లక్ష్మణ్, మశ్చందర్, తుకారాం, ఈశ్వర్, సాయిలు, వినయ్ పాల్గొన్నారు.

జోరుగా చెట్ల నరికివేత

మితిమీరుతున్న కలప వ్యాపారుల ఆగడాలు



చెట్లను నరికి తరలిస్తున్న వ్యాపారులు

వట్‌పల్లి(అందోల్): అక్రమ కలప వ్యాపారుల ఆగడాలకు అంతేలేకుండా పోతోంది. ఎక్కడా చెట్టు కనిపించినా అక్కడ గబ్బిలంలా వాలిపోయి రైతులకు ఎంతో కొంత ముట్టజెప్పి గంటల వ్యవధిలో చెట్లను నేలకూలుస్తున్నారు. ఇటుకబట్టీలు, ఫ్యాక్టరీలకు కలప అవసరం ఉండడంతో యాజమాన్యాలు ఊరూర కలప వ్యాపారులను తయారు చేసి పచ్చదనంపై ఉసిగొల్పుతున్నారు. దీంతో అందోల్, వట్‌పల్లి మండలాల్లోని గ్రామాల్లో వ్యాపారులు రైతులకు పైసాల ఆశచూపడంతో వారు పొలంగట్లపై ఉన్న చెట్లను అమ్ముతున్నారు. సుబాబ్, నీలగిరి చెట్లు నరుకుతున్నట్లు చెబుతూ వేప, చింత వంటి పెద్దపెద్ద చెట్లను నరికేస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు.